పెద్ద: స్వార్థమేముంది? మన చరిత్ర మనకి తెలియచెయ్యడమే స్వార్థం. అంతకంటే మరేం లేదు.

తండ్రి: అంతేకాదురా. అంతకంటే మరేదో వుంటుంది. మనం చెప్పలేం కాని.

చిన్న: అన్నయ్య కిలాంటివన్నీ తెలియవు నాన్నా.

పెద్ద: ఏడిశావులే.

చిన్న: హోస్సై. ఇంగ్లీషుచదువులో వుండే దగా నీకు తెలియదు.

పెద్ద: నీకు తెలుసులే మహా.

చిన్న: ఆఁ నిజమే.

పెద్ద: సంతోషించానులే.

తండ్రి: ఊరుకోండిరా దెబ్బలాడక.

---

# నూరేళ్లకిందట - సాహిత్యం.

'ఏం మామయ్యా! నాప్రబంధం కాస్తసరిచూసి పెట్టవయ్యా! నీతో చెప్తూనే ఉన్నాను. వీలుకలగచేసుకుని కాస్త చూసి పెట్టవయ్యా అని'

'ఏం పుస్తకంరా నువ్వనేది?'

'అప్పుడే మరుపా! ఆరి దీనమ్మకడుపు కాలా! ఏడాదినుంచి చెప్తున్నాను కాదుటయ్యా!'

'నీకుర్రతనం పుస్తకంపేరు అట్టే పునశ్చరణ చేస్తున్నా నను కున్నావేమిటి!'

'మహాబాగా చెప్పావులే! ఎంతకురత్నం పుస్తకమైనా పేరైనా జ్ఞాపకముండవద్దా!'

'పేరు చెప్పరా అంటూంటే'

'ఇది నూటడెబ్బయ్యోసారి చెప్పడం!'

'అయినా చెబుదూ'

'మాకవిత్వం అంటే అంతనిర్లక్ష్యం అన్నమాట'

'ఇంకా ఎన్నిఅంటావో అను. ఆతర్వాతే అడుగుతాను.'

'ఎన్నిఅన్నానరే, ఎప్పటికీ రే'

'... ... ... ... ...'

'ఎన్నిమార్లు చెప్పానయ్యా పోనీ'

'ఆతర్వాతే అడుగుతానన్నాగా'

'నేను చెప్పకపోతా నేమిటి!'

'చెప్పుమరి'

'చెప్తాడుంటేనే, 'కవిసార్వభౌమ మనోరంజనం'

'ఇంక అది చూసేదేమిటా?'

'కవిత్వసంగతి కాదయ్యా –'

'ఔను! అది నాకు తెలుసులే'

'మరి వ్యాకరణం తప్పులు. దాని తస్సాగొయ్యా, తిక్కన గారు రాసినా ఉంటూనే ఉంటాయి'

'ఔను'

'అవే శాస్త్ర చూసిపెట్టుమని అడగడం, నూటికీ తొంభై తొమ్మిది ముప్పాతికపాళ్ళు అవీ ఉండవు గాని,

'మిగిలిన రవ్వంతా ఉన్నా ఫర్వాలేదురా'

'నువ్వలా అంటావు. ఆపళంగా ఎవడో లంకించుకుంటాడు, కవిసార్వభౌమ మనోరంజన ఖండనం అని. దానికి మండనా

లతో అవస్థ పడాలి. నోరు నొక్కుకుపోతుంది.'

'అయితే ఎవడిలోనూ తప్పులుండ వంటావు. తప్పులు లేని కవిత్వం చూపించు పోనీ'

'అలాంటి పుస్తకమే లేదంటూంటే వినిపించుకోవేమిటి! తిక్కనంతటివాడిలోనే తప్పులుంటాయి. యజ్ఞంచేసి తిక్కన్న గారు వైదీకంగారాశాడు. మనది అచ్చువైదీక కవిత్వంలా ఉండ కూడదు మరి'

'ఎలాగుంటుందిరా నియోగిబిడ్డరచన'

'ఆమాటనిజమే. ఒకవైదీకి కవిమీద కత్తి నూరుతున్నా'

'ఛీ! ఛండాలపుపని. ఎవడు చెప్పాడురా నీకది. అంతకంటే తెలివితక్కువపని ఉంటుందా! కాలహరణాని కంతకంటే పనికి మాలిన పనిఉండదు.'

'ఎంచేత?'

'ఎంచేతంటా వేమిట్రా పైగా'

'అయినా చెబుదూ'

'కవిత్వంరాస్తే (మీసంవడేసి) రాయాలికాని, వైదీకపాడు ఏంరాస్తాడురా!'

'ఆసంగతి వాళ్ళకే తెలుసు, మనకివేరే చెప్పక్కర్లేదు'

'అయితే ఎందుకురాస్తున్నావు మరి?'

'ఏడిపించడానికి'

'అయితే బాగానే ఉందికాని, ఏంతప్పులు చూపిస్తున్నావు?'

'పుస్తకంలో ఏం తప్పులుంటాయి!'

'వ్యాకరణమేనా!'

'అంతకంటే మరొకతప్పంటూ ఉంటుందేమిటి!'

'నిజమే!'

'అంచేత నా పుస్తకం కాస్త చూసి పెట్టవయ్యా అనడం. అడుగుతూన్న కొద్దీ బిగుస్తూన్నావు నువ్వు.'

'వేళ చూసుకోవద్దురా'

'వేళ కుదురుతుందని ఎప్పుడు అంటావు'

'మనం ఎన్ని చూచినా వ్యాకరణం తప్పులు ఉండకుండా ఉండవురా! వ్యాకరణమంటే మహాసముద్రం. ఎవడితరం కాదురా దాన్ని ఈదడం. ఏదితప్పో ఏదిఒప్పో దృఢంగా చెప్ప డానికి ఎవ్వడితరమూ కాదు. నోరు విప్పేటప్పటికి ఇంకో కవి ప్రయోగం కనబడుతుంది, వీడిది తప్పంటూ'

'అయినా మనకి చేతయినంతమట్టుకు'

'అలాగేలే'

'మామయ్యా! ఈకాలంలో గొప్పకవి అంటూ ఒక్కడూ లేడేమిటయ్యా! అంతానా - నీతర్వాతే'

'ఏదో ముగ్గురునలుగు రున్నారుకాని'

'ఎవరెవ రంటావు'

'అక్కినపల్లి నృసింహకవి, గోపాలుని రామకవి, పైడిపాటి వెంకటకృష్ణకవి, కొటికలపూడి వెంకటకృష్ణకవి'

'వైదీక పాళ్ళపేర్లుకూడా చెప్తున్నావు'

'లోకం చెప్పుకుంటూన్న పేర్లు చెప్తున్నానురా'

'సరే ఫర్వాలేదు అయితే'

'వీళ్ళ కవిత్వమయినా—'

'నీకవిత్వంతో సాటిరాదు. మరినాపుస్తకం చూశావు కాదు'

'అబ్బాయీ! కవిత్వానికంతా ఒక్కటే ఆదర్శముంది'

'ఏమిటది?'

'పిల్లవసుచరిత్రల్ని మించిన పెద్దవసుచరిత్ర అవాలి. లేక పోతే కూచిమంచి తిమ్మన్ననిమించి రాయాలి'

'మరినాది'—

'పిల్లవసుచరిత్రలంటే మనవైపు అర్థం అబ్బయామాత్యుడి 'కవిరాజమనోరంజనం,' అడిదం సూరకవి 'కవిజనరంజనం'; తిమ్మన్న పుస్తకాలని గురించీ వేరే చెప్పక్కర్లేదుకదా !'

'మరి మనది'

'వీటిని మించిన కవిత్వంగా ఉండాలి'

'నీకవిత్వం అంటూంటేనే'

'శ్లేష, గర్భ, బంధకవిత్వాలు ఎంతవిస్తారంగా ఉంటే అంత రసవంతంగా ఉంటుంది కవిత్వం'

'అది అందరూ ఎరిగున్న సంగతే. నీకవిత్వం అందులో ఆరి తేరిందయ్యా !'

'ఒకంతటవచ్చిందిట్రా పాకం'

'నాపుస్తకం కాస్త చూశావుకాదు'

'ఇదే ఆదర్శంగా పెట్టుకుని రాయాలి'

'అలాగేకాని ఔనుగానిమామయ్యా ! ఊర్కో అయిదుగురు దేవుళ్ళమీదా అయిదు శతకాలు రాశానయ్యా, నూకాలమ్మా, చామలమ్మాకూడా కలిపి. ఏమిటి ! అయిదూ అయిదురకాల వృత్తాలు. మహాభేషుగ్గా ఉంటాయిలే'

'నేను ఇప్పటికి ఇరవైశతకాలు రాశానురా, చెప్పినవృత్తంలో చెప్పకుండా'

'ఎవడోగాని ఏభైశతకాలుకూడా రాశాడుటయ్యా'

'ఏభైఓలెక్కట్రా, నూరు శతకాలు రాయదలచుకొన్నా నేను'

‘ పేరు బాగాకుదురుతుందయ్యా, శతశతక కర్త అని, మహా గమ్మత్తుగా ఉందిలే’

‘ ఇప్పుడో గ్రంథం తయారు చేస్తున్నా’

‘శతకమే’

‘ కాదురా, పూర్తిగా వినుమరి. వల్లభా పరిణయమనే విఘ్నేశ్వరుడి పెళ్ళికథ’

‘ వెనకెవడో రాసినట్టున్నాడయ్యా’

‘ రాయందిఏదిరా! ఏది వెనకరాయండి! కవిత్వానికి కథ ముఖ్యంకాదుగా. కథలందరి వివొక్కటే. ఏటొచ్చీ శబ్దచమత్కృతే తేడా’

‘ దాని తస్సాగొయ్యా నాడిదే శబ్దచమత్కృతి అంటే. నాడితర్వాతే అందరికవిత్వమూ. ఒక్కఅక్షరంలో పద్యమంతా చెప్పాడు. దానిని మించిన కవిత్వముందా !’

‘ ఏదీచదువు మరోమాటువిందాం’

‘ క. కైకోకీకా కెకుకై
కోకాకాకింకకూకికూకకుకోకి
కాకుకకు కేకికేకిక
కూకోకొకూక్కకకింకకో కైకాకా *
నంది మల్లయ్య, ఘంటసింగన్నల పద్యమింకా ద్వ్యక్షరమే’

‘ వెంకటకవిపద్యంలో ఇంకా ‘న’ కారం తప్పిందికాదు! నేను రాసినపద్యం విన్నావుకాదు, సగమయింది’

‘ దేనితో’

‘ ల’ ఏకాక్షరం’

‘ అచ్ఛా!’

* గణపతివెంకటకవి రచించిన “ప్రబంధ రాజ వేంకటేశ్వరవిజయవిలాసం” లోది.

'కవిత్వమంటే ఒకంతటవుతుందట్రా. నిఘంటువులు విరిగి పోతున్నాయి.'

'మనమూ అలాంటివే ఓ నాలుగుపుంజీలు రాయదలచుకొన్నాం'

'మంచిదే'

'ఎవరికయ్యా అంకితమిస్తావు నీగ్రంథం. నరాంకితమా, దైవాంకితమా ?'

'నరాంకితాలు రెండు అయాయికదుట్రా. ఒకటి వాసిరెడ్డి వారికి, ఒకటి కోటరామచంద్రపురంవారికీ. రెండిటికి రెండు అగ్రహారాలు ఊడిపడ్డాయి. తక్కినవి దైవాంకితాలు'

'ఇదేంచేస్తావు ?'

'ఏమో చెప్పలేను'

'ఔనుగాని దేవుడెలాగ అడుగుతాడయ్యా పుస్తకం అంకితమియ్యమని. వట్టిఅబద్ధమేనా?'

'మనిషి అడగడంకంటే సులువుగా అడుగుతాడు'

'ఏమిటీ?'

'నేను మూడుగ్రంథాలు దైవాంకితాలే చేశానుకదూ'

'ఎలాగా అని?'

'పగలల్లా దాన్నిగురించే ఆలోచించడం'

'ఊ?'

'టక్కున ఎప్పుడో ఒకప్పుడు రాత్రి కలలో చక్కా వస్తుంది'

'ఎలాగయ్యా'

'పగలు తలచుకొన్నవి రాత్రి కలలో రావడంలేదుట్రా'

'ఔను'

'అంతే ఇది కూడా'

'అరె దీని తస్సాగొయ్యా! ఇంతసుళువుటయ్యా! ఏదో బ్రహ్మాండ మంతపని అనుకున్నాను. ఆరి!'

'లేకపోతే ఎలాగిచ్చాననుకున్నావు, మూడు ప్రబంధాలూ కూడా దేవుళ్లకి'

'ఇంకెందుకూ, బోధపడిందికా, అయితే నేనుకూడా రెండు మూడు దైవాంకితాలు జరుపుతా'

'ఊఁ, కానీ'

'వెంకమ్మపని చాలాజోరుగా ఉందయ్యా'

'ఏ వెంకమ్మా?'

'ఏ వెంకమ్మ అంటావేమిటి, తరిగొండ వెంకమ్మ'

'ఏం, ఏంజోరుగా ఉంది'

'చాల కథలు చెప్పుకుంటున్నారు'

'ఊఁ'

'పేరు వితంతువే అని'

'అలాంటివి చాలాచాలా చెప్పుకుంటారులే. ఆడదయితే చాలు కమ్మలు కట్టడానికి. అందులో చదువుకున్నది. ఇంకేం కావాలి. కాకులు పొడిచినట్టుగా పొడిచెస్తారు లోకులు'

'అన్నీ అబద్ధాలే అంటావు'

'సందేహ మెందుకు?'

'పోనీగాని ఇది విన్నావూ?'

'బూతేనా?'

'బూతైతే చెప్తానా!'

'అబద్ధంబూతులు వినకూడదులే'

'ఇదయ్యా! వెంకమ్మని జుట్టు తీయించేసుకో మన్నాడుట

ఓస్వాములారు'

'ఊఁ'

'అలాగే తీయించుకుంటాను గాని ఒక్క ఉపకారం తిరిగి చేసిపెడుదూ అని ఆస్వాము లారిని అడిగిందిట'

'ఊఁ'

'మళ్ళీ వెంట్రుకలు రాకుండా చెయ్యి, మళ్ళీమళ్ళీ వస్తూంటే తీయించుకుని ప్రయోజనమేముంది అందిట'

'బుద్ధొచ్చిందా 'స్వాములారికి'

'రాక, నెత్తినిగుడ్డవేసుగు అదేపరుగు'

'కవయిత్రి దగ్గరా సన్యాసిఆటలు'

'మరే. ఆవిడకవిత్వంలో చాలావేందాంతముంటుందిసుమా'

'దొంగవేదాంతం కాదురా, మనసులో పుట్టుకొచ్చిన వేదాంతం. స్వచ్ఛమైన మనిషి. చాలామంచిది. ఆవిడరాసిన ద్విపదభాగవతం పోతన్నదానికంటె ఎంతో బాగుంటుంది'

'అలాగటయ్యా !'

'ఔనుగాని మామా! పింగళి ఎల్లన్న కిరస్తానీపుస్తకం రాశాడుటేమిటి ?'

'డబ్బుకోసం రాశాడురా, ఏదైనా పురుషోత్తమచౌదరికవి కంటేనయం'

'ఏం, ఎంచేత ?'

'మతంపుచ్చు కున్నాడువాడు'

'అయ్యయ్యో! పాపం! ఏమేంరాశాడేమిటి ?'

'చక్కనిశతకం మొకటి; పేరు దశరథరామ శతకం. తర్వాత ప్రబంధం ఒకటిమంచిది, నీలాచలవిలాసమని'

'ఏమేనా డబ్బొచ్చిందా మతం పుచ్చుకున్నాక'

'చేరేవరకూనే ఆశపెట్టడం'

'చేరేక'

'చేరేక చచ్చినట్టు పడిఉండడమే. డబ్బూ లేదు దసకం లేదు. వెనక్కి రావడానికి దారిలేదు.'

'ఇంతకీ డబ్బంటే అలా పడిచావడ మెందుకూ!'

'అందుకనే అలా అనుభవించడం'

'ముండాకొడుక్కి మంచిపని అయిందిలే ఇలాంటిపని బ్రౌను దొరకూడా చేస్తున్నాడు'

'ఛా! ఛా! చాలామంచివాడురా పాపం. పండితుల్ని చేర దీసి చెయ్యగలిస్తే ఉపకారంచేస్తున్నాడు, లేకపోతే ఊరుకుంటు న్నాడు'

'మంచివాడే పాపం'

'ఇంతాఅంతానా?'

'అవునిగాని ఏమయ్యా! వాక్యగ్రంథాలు తెగ బయలు దేరుతున్నాయేమిటి!'

'వచనంమాటేనా నువ్వు చెప్పటం?'

'ఊఁ'

'దానిమాట చెప్పకురా'

'ఏం?'

'ఒక్కపుస్తకం వచనంలో రాయడంకంటే పదిపుస్తకాలు పద్యంలో రాసుకోడం సుళువు'

'ఏమిటీ!'

'అంతసుళువు'

'నిజంగా!'

'నిజంగానే. అంచేతే మనం ఊరుకోడం'

ఎంచేతయ్యా ?'

'నిఘంటువులు మూలపడతాయి, వచనం రాయడమొస్తే, మాట్లాడేమాటల్లో రాయాలి. ఏ చిత్రకవిత్వం, బంధకవిత్వం, గర్భకవిత్వం గంగలో కలిసిపోతాయి'

'నిజమే'

'కాకపోతే అంచేతే తాటాకుమీద గంటంపెట్టలేం వచనం పేరుచెప్పి'

'ఏమిటీ!'

'అందుకనే మానెయ్యడం'

'సరిసరి. కాని వచనంలో మట్టుగు మహామంచిపుస్తకాలు బయలుదేరాయి సుమా, చదువుతూంటే పద్యగ్రంథాలెందుకూ పనికిరావనిపిస్తున్నాయి.'

'ఔను! నిజమే!'

'అలాంటి పుస్తకాలున్నాయి. అది ముచ్చటగా ఉంటుంది చదివితే'

'బహుకష్టం రాయడం మట్టుగు'

'దాంట్లోకూడా దిగి చూద్దాం'

'అనుభవిస్తావు, దోవ తెలియదు'

'చూద్దాంగా'

'చూసేదేమీలేదు, రాసే దంతకన్నా లేదు'

'చూద్దాంగా'

'చెప్పానుగా'

'తప్పేముంది రాయడం?'

'నీఖర్మం'